సాక్షి
కామారెడ్డి
బుధవారం । 9 । ఆగస్టు । 2023



## ఐటీఐని తరలిస్తే ఉద్యమం

ఎల్లారెడ్డిలోని ఐటీఐ కళాశాలను తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి హెచ్చరించారు.

- 8లో ▸



## వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డి పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశించారు.

- 9లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /21.9

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### జెడ్పీ డిప్యూటీ సీఈవోగా భాగ్యలక్ష్మి



కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా భాగ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నాగర్‌కర్నూలు నుంచి బదిలీపై వచ్చారు. ఆమెను జెడ్పీ చైర్‌పర్సన్ డి.శోభ, వైస్ చైర్మన్ ప్రేంకుమార్, సీఈవో డి.సాయాగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు రాంరెడ్డి, తిరుమల్‌గౌడ్, జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

### 10, 11 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన

కామారెడ్డి అర్బన్: డీఈఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ కోర్సులలో ప్రవేశం కోసం 10, 11 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని నిజామాబాద్ డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 63095 35759 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


### రేపు 'జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ

కామారెడ్డి అర్బన్: తెలంగాణ సారస్వత పరిషత్, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సహకారంతో రూపొందించిన జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని గురువారం ఆవిష్కరించనున్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, దాశరథి సాహితీ పురస్కార గ్రహీత అయాచితం నటేశ్వరశర్మ పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

### మూడు జీపీల ఏర్పాటు

మాచారెడ్డి: మండలంలో మరో మూడు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమారంపేట తండా, గుంటి తండా, ఒడ్డె గూడెం గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కొత్త పంచాయతీలు ఏర్పాట చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాచారెడ్డి మండలంలో గతంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా.. ఇటీవల 11 పంచాయతీలతో పాల్వంచ మండలం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలతో కలిపి ప్రస్తుతం మాచారెడ్డి మండలంలో జీపీల సంఖ్య 25కు చేరింది.

### 'అన్నా భావూ సాఠేను ఆదర్శంగా తీసుకోవాలి'



మద్నూర్: సాహిత్య సమ్రాట్ అన్నా బావూ సాఠేను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పిలుపునిచ్చారు. అవాల్‌గావ్‌లో మంగళవారం అన్నబావూ సాఠే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్నా బావూ సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మద్నూర్ వెళ్లి ఆర్య సమాజ్ అధ్యక్షుడు తమ్మెవార్ రమేశ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు.

### 'ప్రమాణాలతో కూడిన విద్యనందించాలి'


కామారెడ్డి రూరల్: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యనందించాలని రాష్ట్ర పరిశీలకుడు కిషన్ సూచించారు. మంగళవారం ఆయన దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ రెండో రోజు శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యా బోధనలో మెలకువలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి విజయ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఆర్పీలు పాల్గొన్నారు.

**లింగంపేటలో..**

లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణను రాష్ట్ర పరిశీలకుడు కిషన్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి వేణుశర్మ, మండల నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వహీద్‌సిద్దిఖీ, డీఆర్పీలు సుజాత, అనురాధ పాల్గొన్నారు.

# రండి బాబూ రండి!

- వైన్‌షాప్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి
- లాభాలు వచ్చే దందాను వదులుకోకండి
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఆబ్కారీ శాఖ
- ఫోన్లు చేసి మరీ ప్రోత్సహిస్తున్న అధికారులు



సాక్షి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది చివరలో నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యం దుకాణాలకు మూడు నెలల ముందుగానే టెండర్లను ఆహ్వానిస్తోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. జిల్లాలో 49 వైన్‌షాప్‌లకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో మద్యం దుకాణంకోసం చెల్లించే దరఖాస్తు ఫీజు రూ. 2 లక్షలు నాన్ రిఫండబుల్. దుకాణం దక్కకపోయినా ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించరు. అయినప్పటికీ మద్యం వ్యాపారంలో మంచి లాభాలు వస్తాయన్న ఆశతో ప్రతిసారి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. 2021–23 సంవత్సరానికి 960 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 19.20 కోట్ల ఆదాయం సమకూరింది. ఎన్నికల సీజన్ కావడంతో ఈసారి ప్రభుత్వానికి గతంలోకంటే రెట్టింపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.

**ప్రధాన ప్రాంతాలపై ఫోకస్**

మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగే వైన్‌షాప్‌లపై ఆబ్కారీ శాఖ దృష్టి సారించింది. వాటిలో జరిగిన అమ్మకాలు, వచ్చిన ఆదాయం గురించి ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. అవి దక్కించుకుంటే అదృష్ట దేవత వరించినట్టేనని చెబుతూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమాచారం. మార్కెట్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్ధత ఏర్పడిన నేపథ్యంలో చాలామంది రియల్టర్లు మద్యం వ్యాపారంలో అడుగుపెట్టాలని యోచిస్తున్నారు. వారిని ఎక్సైజ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

**పోటీ పెరిగే అవకాశం**

ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు ఈసారి పోటీ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. రెండేళ్ల కిందటే వైన్‌షాప్‌లకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం వరుసగా ఎన్నికలు రానున్న నేపథ్యంలో అమ్మకాలు మరింత ఎక్కువగా జరుగుతాయని భావిస్తున్నారు. దీంతో చాలామంది ఈ వ్యాపారంపై దృష్టి సారిస్తున్నారు. నలుగురైదుగురు కలిసి సిండికేట్‌గా ఏర్పడి ఐదు నుంచి పది దుకాణాలకు దరఖాస్తులు వేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి.

### ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా..

వైన్‌షాప్‌లకు వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు రాబట్టేందుకు ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది. ఇతర రంగాల్లో ఉన్న వారికి సైతం ఎక్సైజ్ శాఖ అధికారులు ఫోన్లు చేస్తూ మరీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. మద్యం వ్యాపారంలో మంచి సంపాదన ఉంటుందని లెక్కలు వేసి మరీ చెబుతూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలుస్తోంది. మద్యం దుకాణాలను అందరి సమక్షంలో డ్రా ద్వారా కేటాయిస్తామని, ఎక్కడా పైరవీలకు తావుండదని వివరిస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఇతర వ్యాపార వర్గాలకు చెందిన వారి ఫోన్ నంబర్లు సేకరించి, వారికి మద్యం టెండర్లపై అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే ఏడాది కాలంలో అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ, మున్సిపల్, మండల, జిల్లా పరిషత్.. ఇలా వరుసగా ఎన్నికలు ఉంటాయని, దీంతో మద్యం అమ్మకాలు మరింత పెరిగి అధిక లాభాలు వస్తాయని ఆబ్కారీ అధికారులు చెబుతుండడంతో కొందరు ఈ వ్యాపారంలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

### 48 దరఖాస్తులు..

జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలుండగా.. ఇప్పటివరకు 18 దుకాణాలకు సంబంధించి 48 దరఖాస్తులు దాఖల య్యాయి. కామారెడ్డి సర్కిల్ పరిధిలో 15 వైన్‌షాప్‌లుండగా.. 8 దుకాణాలకు సంబంధించి 28 దరఖాస్తులు వచ్చాయి. దోమకొండ పరిధిలో ఎనిమిది దుకాణాలుండగా.. మూడింటికిగాను 12, ఎల్లారెడ్డి పరిధిలో ఏడు దుకాణాలుండగా.. నాలుగింటికి 5, బిచ్కుందలో 10 వైన్‌షాప్‌లుండగా.. 2 దుకాణాలకు 2, బాన్సువాడ పరిధిలో తొమ్మిది షాపులుండగా.. ఒక దరఖాస్తు వచ్చాయి. మిగిలిన దుకాణాలకు ఒక్క దరఖాస్తూ నమోదు కాలేదు. ఈనెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. 21న డ్రా ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ పాటిల్

# నేడు ఇందూర్‌కు కేటీఆర్



దుబ్బలోని వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: ఐటీ మంత్రి కేటీఆర్ బుధవారం నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో పాల్గొంటారు. మంత్రి రాక నేపథ్యంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెలిప్యాడ్‌ను సందర్శించి అధికారులకు సూచనలు ఇచ్చారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

**మంత్రి కేటీఆర్ పర్యటన ఇలా..**

మంత్రి కేటీఆర్ బుధవారం ఉదయం 10.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరుతారు. 11.15 గంటలకు నిజామాబాద్ నూతన కలెక్టరేట్ కార్యాలయ ఆవరణకు చేరుకుంటారు. అనంతరం ఐటీహబ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. న్యాక్ భవనం, దుబ్బలోని వైకుంఠ ధామం, ఎన్‌టీఆర్ చౌరస్తాలోని నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనం, వర్నిరోడ్‌లోని వైకుంఠ ధామం, రఘునాథ చెరువు మినీ ట్యాంకు బ్యాండ్, అర్సపల్లి వైకుంఠధామాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఆర్మూర్ రోడ్‌లోని శ్రీరామాగార్డెన్‌లో మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనాలు చేస్తారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌నుంచి తిరిగి పయనమవుతారు.

## జీపీఎఫ్ విభాగం ప్రారంభం

కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కామారెడ్డికి బదిలీ అయిన ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ సిబ్బంది సాధారణ భవిష్యనిధి (జీపీఎఫ్) విభాగాన్ని మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత తమ జీపీఎఫ్ ఖాతాలను కొత్త జిల్లాకు బదిలీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు సర్కారు ఖాతాలను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఖాతాలు బదిలీ అయ్యాయి. జెడ్పీలో జీపీఎఫ్ నిధి నిర్వహణ కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సీఈవో డి.సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ ప్రేంకుమార్, మాచారెడ్డి, దోమకొండ, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యులు ఎం.రాంరెడ్డి, తిరుమల్ గౌడ్, మనోహర్‌రెడ్డి, బీబీపేట ఎంపీపీ బాలమణి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీపీఎఫ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న దఫేదార్ శోభ

# కేసీఆర్ పోటీ చేస్తే కార్యకర్తగా పనిచేస్తా..



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- షబ్బీర్ అలీపై విమర్శలు

రాజంపేట: కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తే తాను కార్యకర్తగా పనిచేస్తానని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆరెపల్లిలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ కామారెడ్డినుంచి పోటీ చేయాలని సీఎం కేసీఆర్‌ను తానే కోరానన్నారు. తనకు నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. కామారెడ్డి నియోజకవర్గానికి షబ్బీర్ అలీ, ఆయన సోదరుడు చేసిన గాయాలు ఇంకా ప్రజలు మరవలేదన్నారు. కాంగ్రెస్ హామీల పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు ఎందుకు ఇలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తుండడంతో అసాధ్యమయ్యే పథకాలతో ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సర్పంచ్ కొమ్ము యాదగిరి, ఎంపీటీసీ నర్మాల రాజు, నాయకులు భిక్కాజి బల్వంతరావ్, మోహన్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్, కమలాకర్ రావు, నీరడి శంకర్, మాణిక్యం, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా వ్యవసాయ గణన చేయాలి

- 28లోగా పూర్తి చేయాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



వ్యవసాయ మూల్యాంకనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: వ్యవసాయ గణన సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ గణనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28 వరకు వ్యవసాయ గణన పూర్తి చేయాలన్నారు. ఖచ్చితమైన సమాచారం సేకరించేందుకు మొదటిసారిగా సాంకేతికతను వినియోగించి సర్వే చేస్తున్నామన్నారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన వివరాలు సేకరించాలన్నారు. ధరణి పోర్టల్ ఆధారంగా రైతుల సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. రైతుల జీవన స్థితిగతులు, సాగవుతున్న పంటల స్వరూపం, స్వభావాన్ని వ్యవసాయ గణన ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అగ్రి సెన్సెస్ పేరిట ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారని, దానిని ఏఈవోలు డౌన్‌లోడ్ చేసుకొని గణన పూర్తి చేయాలన్నారు. ధరణి పోర్టల్ ఆధారంగా మొదటి దశలో రైతు పేరు, సామజిక స్థితి, భూ విస్తీర్ణ వివరాలు, వ్యక్తిగత సాగు, ఉమ్మడి సాగు, పురుషులు, మహిళా రైతులులాంటి అన్ని వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. రెండో దశలో ప్రణాళిక శాఖ నిర్దేశించిన టీఆర్‌ఏఎస్ (టైమ్‌లీ రిపోర్టెడ్ అగ్రి స్టాటిస్టిక్స్) రైతుల స్థితిగతులను, మూడో దశలో పంటల సాగుకు చేస్తున్న వ్యయం, వినియోగిస్తున్న యంత్ర పరికరాల వివరాలు నమోదు చేయాలన్నారు. అన్నదాతలకు సంక్షేమ పథకాలతో పాటు ఇతర కార్యక్రమాలు అమలు చేసుకునేందుకు ఈ సమాచారం దోహదపడుతుందన్నారు. మూడు దశలలో గణన చేయాల్సిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ఏఈవోలకు వివరించారు. అనంతరం రుద్రూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన వ్యవసాయ మూల్యాంకనం పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గణాంక శాఖ సహాయ సంచాలకులు శ్రీవల్లి, ఉప గణాంక అధికారులు పూరి రాజు, సుధ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజారాం, డీఏవో భాగ్యలక్ష్మి, ఏడీఏలు, ఏవోలు, ఏఈఓలు, మండల గణాంకాధికారులు పాల్గొన్నారు.

### వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

కామారెడ్డి క్రైం: స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని ఇందిర గాంధీ స్టేడియంలో నిర్వహించే వేడుకలలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. స్టాల్స్, రుణాల పంపిణీ, బందోబస్తు, గౌరవ వందనం ఏర్పాట్లు చేయాలన్నారు. విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇవ్వడానికి వివరాలు సిద్ధం చేయాలన్నారు. సమవేశంలో అదనపు ఎస్పీ కేఎస్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సయ్యిద్ అహ్మద్ మస్రూర్ పాల్గొన్నారు.

# బోగస్ స్టాంపులకు ఇక చెల్లు!

- ఆన్‌లైన్‌లోనే విక్రయాలు
- మాన్యువల్ తేదీలతో విక్రయాలు నిలిపివేత
- అక్రమాలకు అవకాశం లేకుండా చర్యలు



దోమకొండ : స్థిరాస్తుల క్రయవిక్రయాల ఒప్పందాలు, ఆస్తుల విక్రయాల దస్తావేజుల తయారీ సందర్భాల్లో స్టాంప్ పేపర్‌లు తప్పనిసరి. ఒప్పందాలను, వీలునామాలను గతంలోనే చేసుకున్నట్లు పాత తేదీల్లో స్టాంపులను కొనుగోలు చేసేందుకు మాన్యువల్ విధానంలో వీలుండేది. దీంతో స్టాంప్ వెండర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పాత తేదీల్లో స్టాంప్ పేపర్లు విక్రయించేవారన్న ఆరోపణలున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు సర్కారు నూతన విధానాన్ని తీసుకువచ్చింది. గత నెలలో జుడీషియల్ స్టాంప్ పేపర్ విక్రయాలు ఆన్‌లైన్ విధానంలో జరిగేలా మార్పు చేసింది.

**నూతన విధానంలో..**

గతంలో స్టాంప్ వెండర్‌లు కొనుగొలుదారుడి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, స్టాంపులు విక్రయించేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో స్టాంప్ పేపర్‌లను విక్రయించడంతో విక్రయాల్లో పారదర్శకత నెలకొంది. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో స్టాంప్ పేపర్ కొనుగొలుదారుడి పేరు, తండ్రి పేరు, నివాసం, ఫోన్‌నెంబర్, ఈమెయిల్ ఐడీ, ఎందుకు కొనుగోలు చేస్తున్నారో వివరాలు నమోదు చేసిన తర్వాత స్టాంప్‌లను విక్రయించేలా యాప్‌ను రూపొందించారు. వెండర్‌కు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు, ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా ఉండాలి. అక్కడ నమోదు చేసిన వివరాలు బాండ్ పేపర్‌పై ప్రింట్ తీసి ఇవ్వాలి. ప్రతి ఏడాది వీరు రిజిస్ట్రార్‌తో వెండర్‌గా కొనసాగేందుకు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

**వెండర్‌లకు ఇబ్బందులు..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్‌తో పాటు బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కామారెడ్డి, దోమకొండ, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి, భీమ్‌గల్‌లలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఆయా కార్యాలయాల పరిధిలో మారిన విధానంతో స్టాంప్ వెండర్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు, ఇంటర్‌నెట్ కనెక్షన్ తప్పనిసరి అవడం వల్ల అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. స్టాంపుల విక్రయం వల్ల 5 శాతం కమీషన్ లభిస్తుంది. ఖర్చులు పెరిగాయిగానీ ఆదాయం మాత్రం పెరగలేదని స్టాంప్ వెండర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలామంది వెండర్‌లు కొత్త విధానం పాటించక విక్రయాలు కూడా నిలిపివేసినట్లు తెలిసింది.

**నూతన విధానం ద్వారానే..**



కొత్తగా అమలోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం ద్వారా అక్రమాలకు అవకాశం ఉండదు. దీనిని ఖచ్చితంగా స్టాంప్ వెండర్‌లు పాటించాలి. టీ ఫోలియో యాప్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా వినియోగదారులు వీటిని తీసుకోవచ్చు. లేదా స్టాంప్ వెండర్‌ల వద్ద ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి స్టాంప్ పేపర్లు తీసుకోవాల్సి ఉంటుంది.

– జబ్బార్, సబ్ రిజిస్ట్రార్, దోమకొండ


# రూ. 2 కోట్లతో అల్లం వ్యాపారి పరార్!

- లబోదిబోమంటున్న బాధితులు

సాక్షి, కామారెడ్డి: ఎక్కడినుంచో వచ్చి వ్యాపారం చేస్తూ జనాన్ని నమ్మించి అప్పులు చేసి, రూ. 2 కోట్లతో ఉడాయించాడో వ్యాపారి. విషయం తెలియడంతో అతడికి అప్పిచ్చినవారు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి జిల్లా కేంద్రానికి వలస వచ్చి, పట్టణంలోని డెయిలీ మార్కెట్‌లో అల్లంతో పాటు వెల్లుల్లి, ఉల్లి వ్యాపారాలు చేస్తున్నాడు. స్థానికంగా పరిచయాలు పెంచుకుని అందరినీ నమ్మించి, అప్పులు తీసుకున్నాడు. ఇలా రూ. 2 కోట్ల వరకు అప్పులు చేసినట్లు తెలిసింది. ఇటీవల ఆ వ్యాపారి బిచాణా ఎత్తేయడంతో అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. పక్షం రోజులుగా సదరు వ్యాపారి గురించి వెతుకుతున్నా దొరక్కపోవడంతో నిండా మునిగామని ఆవేదన చెందుతున్నారు.

# ఆర్టీసీ విలీనం చరిత్రాత్మక నిర్ణయం

- తెలంగాణ దేశానికే ఆదర్శం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



స్పీకర్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

బాన్సువాడ: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆర్టీసీ ఉద్యోగులు స్పీకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సర్కారు నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారన్నారు. అసెంబ్లీలో బిల్లు పాసయ్యిందని, త్వరలోనే చట్టంగా మారుతుందని, దానిని తీసేసే అధికారం ఎవరికీ ఉండదని పేర్కొన్నారు. అంతకుముందు ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు సీఎం కేసీఆర్, స్పీకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఎజాస్, మోహన్‌నాయక్, నర్సింలు, ఆర్టీసీ డీఎం సదాశివ్, ఉద్యోగులు బసంత్, రవీందర్‌గౌడ్, గిరిధర్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎండీఎం కార్మికుల సమస్యల్ని పరిష్కరించండి

**కామారెడ్డి టౌన్:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించి, పెరిగిన ధరలకు అనుగుణంగా స్లాబ్ రేట్లను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి రాజశేఖర్, తదితరులున్నారు.

### యువకుడి అదృశ్యం

**కామారెడ్డి క్రైం:** జిల్లా కేంద్రంలోని సైలనీబాబా కాలనీకి చెందిన ఓ 19 ఏళ్ల యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు. కాలనీలో నివాసం ఉండే షేక్ నసీమా బేగానికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు అయాన్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 31న హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత అయాన్‌కి ఫోన్ చేస్తే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మాట్లాడుతున్నారని తల్లి నసీమా చెబుతోంది. చాలా చోట్ల గాలించినా అయాన్ ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### మతిస్థిమితం లేని మహిళ..

**బాన్సువాడ రూరల్:** రాజారం దుబ్బ కాలనీకి చెందిన ఉబ్బి లక్ష్మి(55)ఈ నెల 4 నుంచి కన్పించడం లేదని ఆమె కుమారుడు ఉబ్బి దుర్గయ్య మంగళవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా తన తల్లికి మతిస్థిమితం లేదని ప్రతిరోజు బాన్సువాడ పట్టణంలో భిక్షాటన చేసి సాయంత్రం ఇంటికి వస్తుండేదన్నారు. ఈ నెల 4న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదదన్నారు. ఆచూకీ తెలిసిన వారు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- కుక్క అడ్డురావడంతో ఘటన

**మద్నూర్(జుక్కల్):** మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద గల జాతీయ రహదారి–161పై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో సంతోష(27) అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. జుక్కల్ మండలంలోని పెద్ద గుల్లకు చెందిన సంతోష్ తన ద్విచక్ర వాహనంపై ఒంటరిగా బిచ్కుంద నుంచి మద్నూర్ వైపునకు వస్తుండగా పెద్ద ఎక్లార గేట్ సమీపంలో జాతీయ రహదారిపై కుక్కను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంతోష్ తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. ప్రమాదానికి కారణమైన కుక్క కూడా ఈ ఘటనలో మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సంతోష్ హైదరాబాద్‌లో పని చేస్తున్నారని, ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని చెప్పారు.

# ఐటీఐని తరలిస్తే ఉద్యమం చేస్తాం

- సిబ్బందికి వేతనాలు వెంటనే చెల్లించాలి
- పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి



ఎల్లారెడ్డిలోని ఐటీఐ ఆర్‌జేడీతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐని తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐని పరిశీలించారు. ఎల్లారెడ్డి ఐటీఐలో ఒక కోర్సుకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. ఐటీఐని ఇతర ప్రాంతానికి తరలిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఈవిషయమై ఆర్జేడీతో మాట్లాడారు. సిబ్బంది వేతనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణంలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. నాయకులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాశీరాం, అఫీజ్, తదితరులున్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ శోభకు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు

**కామారెడ్డి రూరల్:** పార్ట్‌టైం స్వీపర్ల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, సీఈవో సాయాగౌడ్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 44వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీస వేతనం రూ.27 వేల వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నేతలు బాలయ్య, శివలింగం, గంగయ్య, సిద్దిరాములు, మునీరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

### సౌత్ క్యాంపస్‌లో 2కే రన్



మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు

**భిక్కనూరు:** తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 2కే మారథాన్ రన్‌ను నిర్వహించారు. యువతలో కిశోర బాల బాలికల్లో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ మారథాన్ రన్ ద్వారా తెలియజేస్తామని సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ అంజయ్య తెలిపారు. అలాగే హెచ్‌ఐవీ నివారణ చర్యల గురించి ఈ రన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సౌత్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థుల్లో 10 మందిని ఈనెల 11న జిల్లా కేంద్రంలో జరిగే మారథాన్ రన్ కోసం ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. హాస్టల్ వార్డెన్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రొఫెసర్లు లలిత, హరిత, సబిత, ప్రతిజ్ఞ రమాదేవి, వైశాలి, శ్రీమాత, యాలాద్రి, నర్సయ్య, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఈవోలకు సహాయకులను నియమించాలి

**కామారెడ్డి అర్బన్:** ఏఈవోలు క్షేత్రస్థాయిలో ఉద్యోగం చేయడం ఇబ్బందిగా మారిందని, వారి పని భారం తగ్గించడానికి సహాయకులను నియమించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలకు పంట వివరాల నమోదు, రైతుల సమీకరణ, సమావేశాల ఏర్పాటు, రైతు బీమా, రైతు బంధు, కిసాన్ సమ్మాన్ నిధి, రైతు వేదికల ఏర్పాట్లు అనేక పనులున్నందున వారికి సహాయంగా రెవెన్యూ సహాయకులను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించిదని, తీరా ప్రభుత్వ ఉత్తర్వు లో వ్యవసాయశాఖ అంశం లేదని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడి ఉన్నారు.

### ఉద్యోగం నుంచి తొలగించారని ధర్నా

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బోయిని యాదగిరి, తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ధర్నా చేశారు. నాగిరెడ్డిపేట సబ్ స్టేషన్‌లో క్యాజువల్ లేబర్‌గా పని చేస్తున్న యాదగిరి అనారోగ్యం కారణంగా రెండు రోజులు విధులకు రాకపోవడంతో ఏఈ మనోరంజన్, లైన్‌మెన్ రాములు బెదిరించి విధులకు ఇక నుంచి రావద్దని చెప్పారని, దీంతో మనస్తాపం చెంది తన చావుకు ఏఈ మనోరంజన్ కారణమని వాట్సప్‌లో పోస్టు చేసి డిలీట్ చేశానని యాదగిరి తెలిపారు. ఈ విషయమై ఏఈ నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఉద్యోగంలో నుంచి తొలగించడంతో పాటు, తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ యాదగిరి తన కుటుంబసభ్యులతో ధర్నా చేశారు. డీఈ గణేష్ స్పందించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

### ఖాళీలను భర్తీ చేయాలి

**కామారెడ్డి టౌన్:** జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల పరిధిలో ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పురుష ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎంపీహెచ్ఏ(మేల్) ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీహెచ్ఏ కోర్సును పూర్తి చేసుకొని 15 సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. వైద్యశాఖలో ప్రజలకు ఉత్తమమైన సేవలను అందాలంటే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

### 'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'



**నిజాంసాగర్(జుక్కల్):** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత తోట లక్ష్మీకాంత రావు అన్నారు. మంగళవారం సుల్తాన్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడితో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశాయని ఆరోపించారు.

### ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ అన్నారు. మాల్తుమ్మెదలో మంగళవారం గ్రామస్తులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవాలన్నారు.ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమని పేర్కొన్నారు. ఆర్టీసి సీఐ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

### అనుమతుల్లేని కోచింగ్ సెంటర్లను సీజ్ చేయండి

**బాన్సువాడ:** అనుమతి లేని కోచింగ్ సెంటర్లను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాన్సువాడ మండల విద్యాధికారి కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మనోజ్, సాయి, మహేష్, సంతోష్, తదితరులున్నారు.

# ఎస్సైగా ఎంపికైన హోంగార్డు కుమార్తె



కూతురితో సుచిత

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండల కేంద్రానికి చెందిన హోంగార్డు మద్ది వివేకానంద రెడ్డి కుమార్తె సుజిత ఎస్సైగా ఎంపికయ్యారు. సుచిత తాడ్వాయి ఉన్నత పాఠశాలలో 10 తరగతి వరకు తెలుగు మీడియంలో చదివారు. అనంతరం కామారెడ్డిలోని శ్రీఆర్యభట్ట కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం ఎస్‌జీటీ టెట్‌లో క్వాలిఫై అయిన తర్వాత టీచరు పరీక్ష రాసినా ఉద్యోగం రాలేదు. ఆ తర్వాత కామారెడ్డిలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సు పూర్తి చేశారు. సుజిత భర్త సుమన్‌తో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే ఓ కోచింగ్ సెంటర్‌లో సంవత్సరం పాటు ఎస్సై కోచింగ్ తీసుకున్నారు. నాలుగేళ్ల కూతురు ఉన్న సుచిత కష్టపడి చదివి ఎస్సై పరీక్ష రాసి ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం సుచిత తండ్రి వివేకానందరెడ్డి కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. సుచిత ఎస్సైగా విజయం సాధించడంతో ఆమె తల్లిదండ్రులు శారద, వివేకానందరెడ్డి, భర్త సుమన్, సోదరుడు సంతోష్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

**బాన్సువాడ:** నిర్ణయించిన డబ్బుల కంటే రోగుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం బాన్సువాడలో ప్రైవేటు అంబులెన్సులను ఆయన తనిఖీ చేశారు. అంబులెన్స్ డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోకి వెళ్లవద్దని, ప్రభుత్వ అంబులెన్స్ అందుబాటులో లేని సమయంలో రోగుల అవసర నిమిత్తం ఇతర ఆస్పత్రికి తరలించాలని అన్నారు. రోగుల అవసరాల నిమిత్తం ప్రైవేటు అంబులెన్స్‌లను కామారెడ్డికి రూ.2 వేలు, నిజామాబాద్‌కు రూ.1500, బోధన్‌కు రూ.1000, హైదరబాద్‌కు రూ.5500 లను తీసుకుని తరలించాలని, నిర్ణయించిన అద్దె కంటే ఎక్కువ వసూలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అసంతృప్తి బట్టబయలు

- జెడ్పీ సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీలు గైర్హాజరు
- నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం
- చైర్మన్ తీరుపై నిరసన సెగలు



సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న చైర్మన్ విఠల్‌రావు, పాల్గొన్న జెడ్పీ సీఈవో

**నిజామాబాద్ నాగారం:** జిల్లా పరిషత్‌లో అసంతృప్తి బయటపడింది. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశానికి అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీలు డుమ్మాకొట్టారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసిన చైర్మన్ దాదాన్నగారి విఠల్ కోరం లేనందున్న సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. సమావేశానికి జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కాంగ్రెస్‌కు చెందిన చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్, ధర్పల్లి ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి, రెంజల్ ఎంపీపీ రజనీకిషోర్ హాజరయ్యారు.

**ప్రైవేట్ హోటల్‌లో మంతనాలు..**

జెడ్పీ సమావేశానికి హాజరుకాకుండా అధికా పార్టీకి చెందిన జెడ్పీటీసీలు అందరూ నగరంలోని హైదరాబాద్‌రోడ్‌లో ఉన్న ప్రైవేట్ హోటల్‌లో సమావేశమయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 24 మంది జెడ్పీటీసీలు పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. జెడ్పీ చైర్మన్ సభ్యులకు గౌరవం ఇవ్వడం లేదని, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో భాగస్వామ్యం చేయడం లేదని నిరసించారు. అలాగే జెడ్పీటీసీలకు మండలాల్లో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు తేవడం లేదంటున్నారు. సీఎంతో సంబంధాల పేరుతో తన పరపతిని పెంచుకునే ప్రయత్నమే తప్ప సభ్యుల గౌరవ మర్యాదలు పట్టించుకునే స్థితిలో చైర్మన్ లేరన్నారు. దీంతో పాటు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న సీసీ మహేశ్‌ను తొలగించాలని పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. తమకు తెలియకుండా అన్ని పనులు చేసేసి చుట్టపు చూపుగా సభ్యులను ఆహ్వానించడం పట్ల కూడా వారంతా గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.

**మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు లేఖలు**

జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావుకు మొండి వైఖరి మార్చుకోవాలని పలు మార్లు విన్నవించినట్లు జెడ్పీటీసీలు పేర్కొన్నారు. తీరు మార్చుకోనందున ఎమ్మెల్సీ కవిత, మంత్రి కేటీఆర్‌లకు లేఖ ఇవ్వనున్నట్లు తెలిసింది. చైర్మన్‌తో పాటు, సీసీ మహేశ్ సైతం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అందుకే జెడ్పీ చైర్మన్‌పై అధిష్టానికి లేఖ రాయనున్నట్లు తెలిసింది.

**నగరంలో జోరుగా చర్చ**

మంత్రి కేటీఆర్ పర్యటనకు ఒకరోజు ముందు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్‌కు, జెడ్పీటీసీల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రెండేళ్లుగా చెప్పినా చైర్మన్‌లో మార్పురావడం లేదంటున్నారు. ఇది వరకే రెండు, మూడు సార్లు రహస్యంగా జెడ్పీటీసీలు ప్రైవేట్‌గా సమావేశం అయ్యి చర్చించుకున్నట్లు తెలిసింది. అందుకే పక్కా ప్లాన్ ప్రకారం జెడ్పీ సమావేశం రోజున సమావేశాన్ని బైకాట్ చేశారు. ప్రస్తుతం ఇది హాట్‌టాఫిక్‌గా మారింది. జెడ్పీటీసీలు సమావేశానికి హాజరుకాకపోవడంతో అధికారులు ఇదే విషయమై చర్చించుకుంటున్నారు.



## క్రైం కార్నర్

### బురదలో పడి వ్యక్తి మృతి

**బోధన్ రూరల్ (బోధన్):** వ్యవసాయ క్షేత్రంలో వరి పంటకు మందు చల్లుతూ ప్రమాదవశాత్తు బురదలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బోధన్ మండలంలోని సంగం గ్రామంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం సంగం గ్రామానికి అబ్బ బోయి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన అబ్బారెడ్డి అనే వ్యక్తి వ్యవసాయ పొలంలో బుధవారం వరి పంటకు మందులు చల్లుతుండగా గట్టు పైనుంచి కాలు జారి ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరి ఆడక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్ గురువారం తెలిపారు.

### పెళ్లి కావడం లేదని ఆత్మహత్య

**మాచారెడ్డి:** పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సోమారంపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అన్నాడి ప్రవీణ్ రెడ్డి(38)కి గత కొన్నేళ్లుగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వివరించారు.

### మద్యానికి బానిసై..



చిన్నరాజు (ఫైల్)

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ పట్టణంలోని రంగచారి నగర్ కాలనీకి చెందిన తొండ చిన్నరాజు(35) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఓ హోటల్‌లో పనిచేస్తు జీవించే చిన్నరాజు మద్యానికి బానిసై మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

### చెరువులో పడి మహిళ..

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులోని చెరువులో దూకి టేకి గంగు(50) అనే మహిళ మృతి చెందింది. పట్టణంలోని సంతోష్‌నగర్ చెందిన టికి గంగు తన బంధువులతో ఇంటి విషయంలో తరుచూ గొడలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయి, మంగళవారం పెర్కిట్ చెరువులో శవమై కనబడింది. భర్త టికి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### నిద్రమత్తులో బంగ్లాపై నుంచి పడి..

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో సోమవారం అర్ధ రాత్రి సంతోష్ కీమా రాథోడ్(38) అనే వ్యక్తి నిద్ర మత్తులో బంగ్లాపై నుంచి పడి మృతి చెందాడు. మహారాష్ట్ర కిన్వట్ చెందిన సంతోష్ కుటుంబ సభ్యులతో కలిసి కొంతకాలంగా జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి బంగ్లాపై పడుకున్న సంతోష్ నిద్రలో బంగ్లాపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

# అనారోగ్యంతో విరక్తి చెంది..

- జీజీ కళాశాల అటెండర్ ఆత్మహత్య
- సెల్‌టవర్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- కొడుకు మృతితో గుండెలు బాదుకున్న తల్లి



నవీన్ (ఫైల్)



మృతదేహాన్ని కిందికి దించుతున్న పోలీసులు

**నిజామాబాద్ సిటీ:** ఇంటికి రాని కొడుకు కోసం వెతుకుతూ ఉండగా రోడ్డుపక్కన సెల్‌టవర్‌కు కొడుకు మృతదేహం వేళాడుతుండడంతో ఆ తల్లి గుండెలు బాదుకుంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ కుటుంబం రోడ్డు పాలైంది. నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని సంజీవయ్య కాలనీకి చెందిన సెల్వాజీ నవీన్‌కుమార్(33) జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య రమ్యకృష్ణ, ఐదు, మూడేళ్ల ఇద్దరు పిల్లలున్నారు. ఇతనికి కాళ్లనొప్పులు ఉండటంతో సక్రమంగా విధులకు వెళ్లేవాడు కాదు. ఓ పక్క అనారోగ్య సమస్యలు, దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులున్నాయి. గత సోమవారం తాను ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం రాత్రంతా వెతికిన నవీన్‌కుమార్ తల్లి, అక్క కుటుంబీకులు ఆటోల్లో స్థానికంగా వెతికేందుకు బయలుదేరారు. నవీన్ అప్పుడప్పుడు మద్యం తాగి ఖానాపూర్ చౌరస్తా, శివారు ప్రాంతాల్లో పడిపోతుండడంతో అక్కడ వెతికేందుకు వెళ్లగా ఖానాపూర్ చౌరస్తా వద్ద సెల్ టవర్‌కు తన తమ్ముడు నవీన్ మృతదేహాన్ని వెళ్లాడుతుండడం చూసి దగ్గరికెళ్లారు. సెల్‌టవర్ కింద నవీన్ ఫోన్ పడి ఉండడంతో అతడేనని నిర్ధారించుకుని గుండెలు బాదుకున్నారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దింపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచకు తరలించారు. తన భర్త కొన్ని నెలలుగా కాళ్లనొప్పులున్నాయని, ఆర్థిక ఇబ్బందులున్నాయని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య రమ్యకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జీజీ కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ నవీన్ కుమార్ గతంలో మహిళా కళాశాలలో పనిచేసేవాడని అక్కడ ఎయిడెడ్ వ్యవస్థ ముగియడంతో రెండేళ్ల క్రితం జీజీ కళాశాలకు వచ్చాడన్నారు. వీరికి ప్రస్తుతం జూన్, జూలై నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారంరోజులుగా నవీన్ డ్యూటీకా రావట్లేదన్నారు.

# మురికి కాలువలో శిశువు మృతదేహం



బోధన్ పట్టణంలోని ఉట్కీర్‌గల్లీలో మురికి కాలువలో మృత శిశువు

**బోధన్‌టౌన్(బోధన్):** బోధన్ పట్టణంలోని ధ్యాకం గల్లీ కాలనీలోని మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని పడేసిన వైనం మంగళవారం బోధన్‌లో నెలకొంది. గమనించిన స్థానికులు పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారమిచ్చారు. ఎస్సై పీటర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఆర్నెళ్ల గర్భస్థ శిశువు అని నిర్ధారించి, శిశువు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మనవత్వాన్ని మరిచి ఇలాంటి చర్యలకు పాల్పడడం సబబు కాదని, వార్డుల వారీగా ఆయా అంగన్‌వాడీ సెంటర్లు ఉంటాయని, సమగ్ర విచారణ జరిపిస్తామని సూపర్ వైజర్ రాధికా రాథోడ్ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ టీచర్ కలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నీటి గుంతలో పడి రైతు మృతి



సంజయ్ రెడ్డి(ఫైల్)

**ఆర్మూర్‌టౌన్ :** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌కు చెందిన ఇట్టెడి సంజయ్ రెడ్డి(32) అనే రైతు మంగళవారం నీటి గుంతలో పడి మృతి చెందాడు. కొటార్మూర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేయడానికి వెళ్లిన సంజయ్ రెడ్డి కాలువ దాటుతుండగా నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో గుంతలు ఏర్పడ్డాయి. వాటిని గమనించక సంజయ్ రెడ్డి ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు బయటకు తీసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య గౌతమి, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు తెలిపారు.

### కత్తిపోట్ల దాడిలో నిందితుడి అరెస్ట్



**ఖలీల్‌వాడి:** వివాహేతర సంబంధం కొనసాగించాలని స్వాతి అనే మహిళపై కత్తితో దాడిచేసిన ఘటనలో నిందితుడు సావంత్ నిలేష్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బతుకు దెరువు కోసం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పాలీ గ్రామానికి చెందిన నిలేశ్ మూడేళ్ల క్రితం నిజామాబాద్‌కు లేబర్‌పని చేసేందుకు వచ్చాడు. అతడికి నాగారం కాలనీకి చెందిన స్వాతితో పరిచయం అక్రమసంబంధానికి దారితీయగా వారు ఏడాది క్రితం మహారాష్ట్రలోని పండరీపూర్‌కు వెళ్లారు. అక్కడ ఆర్నెళ్లు ఉన్నారు. అయితే స్వాతి తనకు భర్త, పిల్లలు గుర్తొస్తున్నారని తనను నిజామాబాద్ తీసుకెళ్లాలని నిలేశ్‌తో గొడవకు దిగింది. నిజామాబాద్‌వచ్చిన తర్వాత స్వాతి తన భర్త, పిల్లల వద్దకు వెళ్లి అక్కడే ఉంది. నిలేశ్ స్వాతిని ఎన్నిసార్లు పిలిచినా రాకపోవడంతో కక్ష పెంచుకున్న నిలేశ్ ఈనెల 6వ తేదీన కసాబ్‌గల్లీలో స్వాతి మరో మహిళతో ఉండగా కత్తితో దాడి చేశాడు. స్వాతి కడుపులో, మెడ, తలపై కత్తితో దాడిచేశాడు. పక్కనున్న మహిళ అడ్డుపడగా అక్కడినుంచి పరారయ్యాడు. మంగళవారం అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న టౌన్ సీఐ నరహరి, ఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు మనోహర్, అక్తర్‌లను ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.